# బామ్మగారు - బొచ్చుకుక్క!

బామ్మకు నాలుగు వాటాల ఇల్లుంది. పాతికెకరాల పొలముంది! నూరు శవార్ల బంగారునగలున్నయ్. భర్త పోయాక అవి బ్యాంకులాకర్లో గురకపెడుతున్నయ్.

ఆమెకు లేని దల్లా చదువు... సంతానం ముఖాన బొట్టు... మెడలో తాళి! పదేళ్లు కాపురం చేసిన భర్త సర్వం భార్య పరం చేసి సడన్‌గా కళ్లు మూశాడు.

తానుపోయాక అయినా సరే బొట్టు తియ్యద్దని నెత్తి గొరిగించుకోవద్దని.... తెల్ల ధోవతి కట్టద్దని చేతిలో చెయ్యి వేయించుకున్నాడు.

అయినా లోకానికి వెరచి భర్తకిచ్చిన మాట తప్పింది. మనిషిసన్నగ అట్లకాడలా వుంటుంది. మాటకారి! చాదస్తం ఎక్కువ! పిల్లికి బిచ్చం పెట్టదు! దాన ధర్మాలు చెయ్యదు! వారానికి నాలుగు రోజులు వుపవాసం! రోజూ రెండు పూటలు గుడికెళ్లి కృష్ణారామా అనుకుంటుంది.

బామ్మకి మడి... ఆచారం జాస్తి! పేరు శేషమ్మ.

'ఏనాడో చేసుకున్న మహాపాపం కాకపోతే... ఇటువంటి వాళ్లు పక్క వాటాలోకి కొత్తగా అద్దెకుదిగాలా? ఛీ... ఛీ!... దరిద్రపు గొట్టు కుక్క నేరుగ వంటింట్లో కొచ్చేస్తోంది. అంతా అంట్ల మంగలం! దీనమ్మ కడుపు కాలిపోను... మడి బట్టలు తాకి చస్తున్నది. ఇదిగో... రోకలి విసిరానంటే దెబ్బకు చస్తావ్...' బొచ్చుకుక్కను తన వాటాలోంచి పక్కింట్లోకి తరమటానికి శతవిధాలా ప్రయత్నం చేస్తూ విసిగిపోతోంది శేషమ్మ బామ్మ.

ఆమెకు కుక్కలన్నా... పిల్లులన్నా... పెంపుడు జంతువులన్నా చెడ్డ చిరాకు.. పరమ అసహ్యం! రాహుకాలంలో ఇంట్లో చేరి వుంటారు. తమతో పాటు కుక్క కూడా వుంటుందని చెప్పి ఏడిస్తే అసలు అద్దెకు ఇల్లు ఇచ్చేదాన్నే కాదు... తన్లో తాను గొణుక్కుంది అక్కసుపోక.

పక్కవాటాలో అద్దెకుదిగిన సుజాత పంచపాళీలో కిరావటం చూచి 'మీ కుక్కనిలా విడిచిపెడితే ఎట్లా? ఇల్లంతా తిరిగి ఆగం చేస్తోంది. అదొచ్చినప్పుడల్లా అదిలించలేక చావుకొస్తోంది. దాన్ని కట్టిపడెయ్...' ఫిర్యాదు చేసింది శేషమ్మ.

'అదేం చేయదులెండి. బుజ్జిముండ అరుస్తుందే గాని ఎవర్నీ కరవదు. ఇది విదేశీయం! ఫారిన్ బ్రీడ్. ఒంటికి రెంటికి వెళ్లాల్సి వచ్చినపుడు కుఁయ్ కుఁ

య్ అని తోకాడిస్తూ ఇంట్లో వారిని చుట్టుకు తిరుగుతుంది. ఈ జన్మలో పొరపాటున కుక్కగా పుట్టినా సుబ్బరస్తురాలు! మాపెట్‌కి ఎన్ని తెలివి తేటలనుకున్నారు? ముందు ముందు మీకే అర్థమౌతుంది దీని మంచితనం! కోప్పడకుండా... కొట్టకుండా కాస్త ఓర్పుగా వుందురూ...' నచ్చ చెప్పింది సుజాత.

'మీరెన్నయినా చెప్పండి... నా మనసుకు నచ్చదు. దీన్నొక చోట కట్టిపడేయండి... ఇతరులకు ఇబ్బంది లేకుండా పోతుంది..' ఉచిత సలహా పారేసింది.

ఎందుకొచ్చిన గొడవలెమ్మనుకుందో ఏమో గొలుసు తెచ్చి దాన్ని గుంజకు కట్టేసింది సుజాత.

అక్కడితో శేషమ్మ మనసు శాంత పడింది. ప్రస్తుతానికి దానివెంట పరుగెత్తే హైరాన తప్పినందుకు సంతోషించింది. గొణుక్కుంటు తను ఇంట్లో కెళ్లి తలుపేసుకుంది.

× × × × ×

కుక్కను కట్టేసినప్పుడల్లా అది అరవటం... (సారీ మొరగటం) ఎక్కువైంది. ఆశబ్దానికి శేషమ్మకి చెవులు చిల్లులు పడుతున్నట్టన్పిస్తున్నయ్. దీనికిదేం పోయే కాలం అనవసరంగ మొరిగిచస్తుంది. ఆకలేసిందేమో? దాని అరుపుతో తలనొప్పి మొదలైంది. శొంఠికొమ్ము అరగదీసి కణతలకు పట్టీలేసుకుని చెవుల్లో పత్తిపెట్టుకుంది.

'అదట్లా 'కుయ్యో... మొర్రో'ని అరుస్తుంటే దానికింత తిండి పెట్టకూడదుటండీ...' దీర్ఘాలు తీసింది శేషమ్మ.

'కట్టేస్తే ఇదిగో ఇలాగే అరిచి గోల చేస్తుంది. ఇంతకుముందే కడుపు నిండా 'పెడిగ్రీ' పెట్టాను....'

'అదేంటి?... కాస్తంత అన్నం కరుడు దాని మొఖాన కొడితే పోయేదిగా!...'

'ఏదిపడితే అది తినదండీ! దీనికి అంతా స్పెషల్. కుక్కలకు పెట్టే ఆహారాన్ని 'పెడిగ్రీ' అంటారు. అది చాలా కాస్ట్లీ...!'

'తిన్నాక ఇంకా ఏంమాయ రోగం?'

'కాస్సేపాగి వుడికించిన గుడ్లు పెట్టి పాలు పట్టాలి. ముప్పొద్దులా కుక్క బిస్కెట్లు తినిపించాలి. లేకపోతే అలుగుతుంది.

'ముష్టి కుక్కలక్కూడా ఇన్నిరకాల తిండా? మనుషులకే తిండి కరువై బాధపడుతూంటే... కుక్కకి ఇంత పోషణా?...'

'ఇది ఖరీదైన జాతి కుక్క బామ్మగారూ! దీని ఖరీదు ఎంతనుకున్నారు? మూడువేలకుపై మాటే!...'

'ఎందుకొచ్చిన పీడ! దీన్ని వదిలించుకోకూడదూ? లేదూ నెలకోమారు కుక్కల బండి వస్తూంటుంది. వాళ్లొచ్చినప్పుడు దీన్ని అప్పగించేస్తే సరి తలనొప్పి లేకుండా పోతుంది నాకు...'

'ఏమండోయ్.. మీ మాటతీరేం బాగోలేదు. కుక్కనంత తేలిగ్గా తీసిపారేయకండి! తిండే కాదు... రోజూ సబ్బు రుద్ది స్నానం చేయించాలి! బైటికి తీసుకెళ్లేటప్పుడు ప్రత్యేకించి కుట్టించిన డ్రెస్‌లేసి... నల్ల కళ్లద్దాలు పెట్టి అలంకరించాలి! శునక ప్రదర్శన పోటీలకు తీసుకెళ్లాలి... దీన్ని అలంకరించినప్పుడు మీరు కనుక చూశారంటే... కళ్లు తిరిగి పడిపోతారు...'

ఈవిడ గారి భర్త పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తాడని తీరా ఇల్లు అద్దెకొచ్చాక తెలిసింది. ముందుగా తెలిసి వున్నట్టయితే రెంట్‌కి ఇచ్చేదే కాదు. మున్సిపాలిటీ వారికి పోలీసు వారికి ఇల్లు అద్దెకిస్తే అన్నీ సమస్యలే! అద్దె పెంచరు. ఇల్లు ఖాళీ చేయరు. ఇలాంటి వారితో చావుకొస్తుంది.

కుక్క న్యూసెన్స్ భరించలేక ఇల్లు ఖాళీ చేయమని చెప్పాలని శేషమ్మ మనసులో వుంది. కానీ అకారణంగ కాళీ చేస్తారో లేకపోతే తన్నులాక్కెళ్లి లాకప్‌లో కూర్చోపెడతారేమోనే భయంతో నోరు మెదపలేకపోతోంది.

ఏం వైభోగం ఈకుక్కది?! ఏ జన్మలో ఏ పుణ్యం చేసుకుందో ఈ జన్మలో వీళ్లకి పెంపుడు కుక్కైంది.

అయినా... కుక్కలను... పిల్లులను.. పందులను పెంచటమేంటి?... వాటిని ముద్దాడటమేంటి?.. విడ్డూరం కాకపోతే...

× × × × ×

ఓ నెల్లాళ్లు గడిచాక...

'బామ్మ గారూ... ఓ శేషమ్మ బామ్మ గారూ!... మీకో శుభవార్త... ఎక్కడున్నారు? ఇట్రండి...' ఇల్లంతా కలియతిరుగుతూ హడావుడి చేసింది సుజాత.

'ఏమిటా గావు కేకలు?... ఎందుకా కంగారు?.. ఏం కొంపమునిగింది?'- వంటింట్లోంచి వస్తూ అంది శేషమ్మ.

'మీనోట అన్నీ అపభ్రంశపు మాటలే.. మంచి మాటలు రావు కదా?...'

'ఏమిటి విషయం? అద్దె డబ్బులు తెచ్చారా? దానికి కేకలు అరుపులు దేనికిట?-' నెత్తిన కొంగు ముందుకు లాక్కుంటూ అంది.

'ఏదీ నోరు తెరవండి...'

'ఎందుకూ?'

'మైసూరుపాక్ తినిపిస్తాను. నోరు తెరుద్దురూ?'

'స్వీటు నాకసలు ఇష్టం వుండదు. విషయం చెప్పండి చాలు..'

'మాపప్పీ లేదూ... అదేనండీ మా పెంపుడు కుక్క... అది... అది...'

'ఎక్కడైనా తప్పిపోయిందా? వీధిలోకెడితే కుక్కల బండి వాడు ఎత్తుకెళ్లాడా ఏమిటీ?-'

'ఛ. వూరుకోండి! అది నెల తప్పిందని పశువుల డాక్టర్ చెకప్ చేసి ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ చేశాడు అర్థగంట క్రితం!- మాకు ఈ వార్త చాలా సంతోషంగా ఉంది. వస్తూ అందరికీ పంచాలని స్వీట్స్ కొనితెచ్చాను...'

ఈవిడ సంబరం కూల! కుక్క నీళ్లోసుకుంటే ఇంత ఆనందమా? పైగా స్వీట్లు పంపకమా? ఏడో నెలొచ్చాక సీమంతం కూడా చేసేట్టుంది... చప్పుడు కాకుండా శేషమ్మ పళ్లూ నూరింది వళ్లు మండి పోవటంతో... పొంగి వచ్చే కోపాన్ని ఆపుకోలేక.

'ఏమిటీ మౌనంగ వుండి పోయారు... మీకు సంతోషంగా లేదా?-'

ఇంకా నయం పాయసం చేసి నేతి గారెలు వండమన్లేదు

'మీ కుక్క... మీ ఆనందం... మధ్యలో నాకెందుకు సంతోషం?-'

'నేను గమనిస్తూనే వున్నాను. మా పప్పీ అంటేనే మీకు గిట్టదు. దాన్ని చూచి కళ్లల్లో నిప్పులు పోసుకుంటారు. తిట్టిపోస్తూంటారు. మీ ఇంట్లో కొస్తే చాలు కర్రతో అదిలిస్తారు. కళ్లెర్ర చేస్తారు'

'సూజాతా... అనవసరంగ నోరు పారేసుకోకు! అధిక ప్రసంగం చెయ్యకు... నేనసలే మంచిదాన్ని కాదు- నాకు కోపం వస్తే... నిన్నూ నీపప్పీని వీధిలోకి విసిరేయగలను...' కోపంతో వూగిపోయింది శేషమ్మ బామ్మ.

'మీరు దాన్ని బ్రతకనిచ్చేట్టు లేరు! దానికి పురుడొచ్చాక మేంమీ ఇల్లు ఖాళీ చేస్తాంలెండి...' కళ్ల నీళ్లు పెట్టుకుని గభాలున తన పోర్షన్లోకెళ్లింది సుజాత.

శేషమ్మలో దిగులు మొదలైంది.

ఒక్క కుక్కతోటే ఇప్పుడు సతమతమౌతూ వేగలేకచస్తుంటే... ఈ మహాతల్లి

ఈని ఓ పది పిల్లలను పెడితే... ఇంకేమైనా వుందా? అన్నీ ఏకమై కొంపంతా తిరుగుతూ నానా ఆగం చేయ్యవూ? అది తాను చూస్తూ సహించగలదా?

వీల్లేదు. ఆకుక్క ఈనే లోపే వాళ్ల చేత ఇల్లు ఖాళీ చేయించాల్సిందే! అప్పుడు గాని తనకు మనశ్శాంతి వుండదు.

ఒక్క కుక్క కరిస్తేనే... బొడ్డు చుట్టూ పద్నాలుగు ఇంజక్షన్లు చేయించుకోవాలంటారు. అలాంటిది దానితో పాటు దానికి పుట్టే పిల్లలన్నీ ఏకమై తన మీద మూకుమ్మడిగా దాడి చేస్తేనో?- అమ్మో!... అప్పుడు చావే గతి! చివరికి తనకు కుక్క చావు తప్పదు కామోసు... తల్చుకుంటేనే భయమేస్తోంది అనేసి శేషమ్మ బెదిరిపోయింది.

సుజాత పెంపుడు కుక్క ఎన్ని పిల్లలను పెడుతుందో శేషమ్మ వూహకు అందటం లేదు. ఈ విషయం తల్చుకుంటేనే వళ్లు జలదరిస్తోంది.

'ఇదిగో బామ్మా! పప్పీపిల్లల్లో ఒకదాన్ని నీకిస్తాలే పెంచుకుందువుగాని నీకు తోడుగా వుంటుంది...' ఎగతాళిగ మట్లాడింది సుజాత.

సుజాత పీక పిసికి చంపేద్దామన్నంత కోపమొచ్చింది. బామ్మకి.

'నీ ఆస్తిలో సగం వాటా నేనివ్వబోయే కుక్కపిల్లకు రాసివ్వమని అడగన్లే... నీ తదనంతరం నీ ఆస్తికి వారసులెవరున్నారని? విదేశాల్లో అయితే పిల్లలు లేని వాళ్లు తమ సంపదను పెంపుడు జంతువుల పేర రాస్తారట నీకు తెలుసా బామ్మా?'

సుజాత మాటకు అరికాలిమంట నెత్తికెక్కినట్టన్పించి 'నా ఆస్తిని ధర్మసత్రానికో... అనాధ శరణాలయానికో రాస్తాను. అంతేగాని పిల్లులకు... కుక్కలకు.. ఎలుకలకు, పందికొక్కుల పేర రాయను...' విసురుగా ఇంట్లోకెళ్లింది.

× × × × ×

ఒక రోజున వున్నట్టుండి పక్కవాటాలోంచి ఏడుపులు పెడబొబ్బలు విన్పించటంతో బియ్యంలో మట్టిగడ్డ లేరుతున్న బామ్మ చాట పక్కనుంచి లేచి సుజాత పోర్షన్‌వైపు వెళ్లింది.

ఎందుకు ఇంటిల్లి పాదీ శోకాలు పెడుతూ గుండెబాదుకుంటున్నారో బోధపడ్లేదు.

శేషమ్మను చూడగానే 'ఇప్పుడు మీ కళ్లు చల్లబడ్డాయా? మా పప్పీని చూచి ఓర్వలేకపోయారు. అసహ్యించుకున్నావ్. దాన్ని తిట్టావ్! ఆడిపోసుకున్నావ్. కుక్కల

బండి వాడికిమ్మన్నావ్... చివరకు దాన్ని చంపి ఉసురు పోసుకున్నావు. ఇప్పుడు నీకు తృప్తిగా వుందా?...' బాధతో మాట్లాడి దొడ్లో నూతికి దూరంగా చచ్చిపడివున్న పప్పీ దగ్గరకు లాక్కెళ్లి బామ్మకు చూపించింది.

పప్పీని తాను చంపటమేమిటి? అదంటే తనకు రోత... అసహ్యం!... అంతేగాని తానెందుకు చంపుతుంది? అసలు పప్పీ ఎలా చచ్చిందో! బోధపడని శేషమ్మ వెర్రి మోహం వేసింది.

'రాక్షసి! దీన్ని చంపి దొడ్లోకి విసిరేసి నీ కచ్చ తీర్చుకున్నావ్- నీ చేతికి బేడీలు వేయిస్తాను. నిన్ను జైల్లో తోయిస్తాను. నీ మీద కేసు పెడతాను... నిన్నొది లేది లేదు... ఆక్రోశించింది సుజాత.

'అమ్మ తోడు!... నీ మీద ఒట్టు! నాకే పాపం తెలియదు. అయినా వున్నట్టుండి ఏ రోగమూ లేకుండా... అందునా చూడుది... చనిపోవటమేమిటీ?'-

'నంగనాచి మాటలు మాట్లాడకు'

ఇంతలో సుజాత భర్త దొడ్లొకొచ్చి అయిందేదో అయిపోయింది. మిగతా విషయాలు తర్వాత ముందు పప్పీని పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లి చావుకు కారణం ఏమైవుంటుందో తెల్సుకుందాం...' అనటంతో ఆస్పత్రికి బయల్దేరారంతా.

పశువుల డాక్టర్ చనిపోయిన పప్పీకి పోస్ట్ మార్టం నిర్వహించి 'మీ పెట్ పాముకాటుకు గురై చనిపోయింది. పాము విషం పప్పీకే కాకుండా కడుపులో వున్న పిల్లలకీ సోకటంతో అవీ మరణించినయ్...' చావుకు కారణం వివరించాడు.

ఆ మాట విన్న సుజాత ఆమె భర్త నివ్వెరపోయారు. పప్పీ చావుకు కారకురాలు బామ్మగారేనని ఆమెను నానా మాటలూ అన్నందుకు నొచ్చుకున్నారు.

దొడ్లో ప్రహరీ చివర ములగచెట్టువైపు పాముపుట్ట వున్నదని... ఇంట్లో చేరినపుడే ఎవ్వరూ అటుకేసి వెళ్లద్దనీ చెప్పిన బామ్మ మాటలు గుర్తుకు రావటంతో 'పప్పీ'ని తీసుకెళ్లి ఖననం చేసి ఇంటి దారిపట్టారు. సుజాత దంపతులు.

వాస్తవం తెల్సుకున్న 'శేషమ్మ బామ్మ' ప్రశాంతంగా వూపిరి పీల్చుకుంది! శాశ్వతంగ తనకు కుక్క పీడ వదిలినందుకు మనసులో సంతోషించింది!!

(సమాప్తం)